క్లుప్తంగా

కంటి రోగులకు శస్త్ర చికిత్స

ఓబులవారిపల్లె : ముక్కవారిపల్లి టీటీడీ కళ్యాణ మండపంలో బుధవారం కంటికి సంబంధించిన 50 మంది రోగులకు వైద్యులు మొబైల్ వ్యాన్‌లో శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు మల్లు ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ ఇప్పటి వరకు 400 మంది రోగులకు కంటి పరీక్షలు నిర్వహించామన్నారు. బుధవారం వైద్యులు శస్త్ర చికిత్సలను చేశారని, వారికి అద్దాలను కూడా అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో మల్లు నివేదిత, ముక్కా మధుసూదన్ రెడ్డి, పీఎస్ రామసుబ్బారెడ్డి, నాగరాజు సుబ్బారెడ్డి, శంకర్ నేత్రాలయ వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

రాజంపేట : విజ్ఞానాన్ని అందించే భాండగారాలు గ్రంథాలయాలని ఏఐటీఎస్ వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి అన్నారు. నవంబర్‌లో ఏఐటీఎస్‌లో నిర్వహించిన గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. బుధవారం విజేతలైన వారికి ఆయన ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నారాయణ, గ్రంథాలయ అధికారి చెన్నారెడ్డి, సిబ్బంది, డీన్స్, హెచ్ఓడీలు, ఆఫీసు సిబ్బంది పాల్గొన్నారు.

సమాన వేతనం కల్పించాలి

పుల్లంపేట : మండల కేంద్రంలోని ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు సమాన పనికి సమాన వేతనం కల్పించాలని బుధవారం రాష్ట్ర స్థాయి యూనియన్ నాయకుల ఆదేశాల మేరకు ఫీల్డ్ అసిస్టెంట్లు ఏపీఓ శ్రీనివాసులకు వినతిపత్రం అందించారు. తమ న్యాయమైన కోర్కెలు తీర్చకుంటే ఈనెల 18న కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తామని పుల్లంపేట మండల ఫీల్డ్ అసిస్టెంట్ యూనియన్ నాయకుడు రామచంద్రారెడ్డి తెలిపారు.

5 మందిపై బైండోవర్ కేసు

రామాపురం : మండలంలోని సరస్వతిపల్లె పంచాయతీకి చెందిన రైతులు వెంకటేశ్వర్లు, వెంకటరమణ, వెంకటసుబ్బయ్య, వెంకటేశ్వర్లు, నాగభూషణలపై బుధవారం బైండోవర్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు. వివరాలు సరస్వతిపల్లె గ్రామంలో వీరు ఇరువురికి పొలం ఉంది. పొలాల వద్ద సాగు నీరు పారకట్టడానికి ఇరువురు ఘర్షణ పడ్డారు. ఇరు వర్గాలపై బైండోవర్ కేసు నమోదు చేసి తహసీల్దార్ ఎదుట హాజరుపరిచి రూ.లక్ష పూచికత్తుపై విడుదల చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అభ్యంతరాలను తెలపండి




సింగనమల వద్ద వరదకు మట్టి కొట్టుకుపోయిన పొలం

పెనగలూరు (ఓబులవారిపల్లె) : మిచాంగ్ తుపానుకు వ్యవసాయ పంట నష్టం గణన ఈనెల 22వ తేదీలోపు పూర్తి చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారని వ్యవసాయశాఖ అధికారి పవన్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో జరిగిన నష్టానికి సంబంధించిన జాబితాను వివిధ కార్యాలయాలలో ఉంచామన్నారు. తహసీల్దార్, ఎంపీడీఓ, రైతు భరోసా, సచివాలయాలలో ఈనెల 18వ తేదీ నుంచి 22వ తేదీ లిస్టు ఉంచడం జరుగుతుందన్నారు. అభ్యంతరాలు ఉంటే తమకు తెలపాలన్నారు. పొందలూరు, ఈటమాపురం గ్రామాలలో మొక్కజొన్న 7.5 ఎకరాలు, అలసందులు ఎకరాలోను, మట్టి కొట్టుకుపోయిన పొలాలు 7.5 ఎకరాలలో ఉన్నాయన్నారు.

పాఠశాల తనిఖీ

రామాపురం : మండలంలో చిట్లూరు పంచాయతీలోని ప్రాథమిక పాఠశాలను బుధవారం మండల విద్యాశాఖ అధికారాలు రామకృష్ణుడు, జయచంద్రలు ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల నిర్వాహణ రికార్డులు, మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన రికార్డులు, విద్యార్థుల హాజరుపట్టికలను పరిశీలించారు. అనంతరం విద్యార్థుల సామార్థ్యాలను పరిశీలించి, జగనన్న గోరు ముద్ద మెనూను, నాడు – నేడు పనులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు.

అన్నదాతలను ఆదుకోవాలి



ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

రాయచోటి టౌన్ : మిచాంగ్ తుపాను బారిన పడి నష్టపోయిన రైతులను అన్ని విధాలుగా ఆదుకోవాలని బీజేపీ రాష్ట్ర కిసాన్ మోర్చా ఉద్యానవన కన్వీనర్ మనోహర్ గౌడ్, అన్నమయ్య జిల్లా ఇన్‌చార్జి చంద్రమౌళి, బీజేపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు సాయిలోకేష్ డిమాండ్ చేశారు. బుధవారం రాయచోటిలోని జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ తుపాను కారణంగా నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు. అలాగే ఈ తుపానులో దెబ్బతిన్న ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలను వెంటనే పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో రాయచోటి కో కన్వీనర్ నిర్మల్ కుమార్, కిసాన్ మోర్చా జిల్లా మోర్చా జోనల్ ఇన్‌చార్జి వెంకట్రామ రాజు, కిసాన్ మోర్చా అధ్యక్షుడు జయప్రకాష్ వర్మ పాల్గొన్నారు.

ప్రతిభను గుర్తించేందుకే ‘ఆడుదాం ఆంధ్ర’

ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి



సచివాలయ సిబ్బందికి క్రీడా సామగ్రిని పంపిణీ చేస్తున్న మేడా, పోలా

రాజంపేట టౌన్ : క్రీడాకారులు తమలోని ప్రతిభను గుర్తించేందుకు ఆడుదాం ఆంధ్ర చక్కటి వేదిక అని ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బుధవారం మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే ఆడుదాం ఆంధ్రకు సంబంధిచిన క్రీడా సామగ్రిని సచివాలయ సిబ్బందికి పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ చాలా మందిలో వివిధ క్రీడల్లో ఎంతో ప్రతిభ ఉంటుందని, అయితే వారు తమ ప్రతిభను గుర్తించ లేకపోతున్నారన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల ప్రతిభ బాహ్యాప్రపంచానికి తెలియడం లేదన్నారు. అందువల్ల సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం ద్వారా క్రీడాకారుల్లోని ప్రతిభ వెలికి తీసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ 15 ఏళ్లపైబడి 35 ఏళ్లలోపు వారు ఎవరైనా క్రీడా పోటీల్లో పాల్గొనవచ్చని అన్నారు. ఈనెల 15వ తేదీ నుంచి ప్రారంభం కానున్న ఈ పోటీల్లో పాల్గొనేందుకు మున్సిపాలిటీలోని క్రీడాకారుల నుంచి విశేష స్పందన లభించిందన్నారు. ఇంకా ఎవరైనా పేర్లు నమోదు చేసుకోకుంటే నమోదు చేసుకోవాలని కోరారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీల్లో వివిధ స్థాయిల్లో (రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల) గెలుపొందిన వారికి బహుమతులు అందజేస్తారని తెలియజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జనార్దన్‌రెడ్డి, వాలీబాల్ అసోసియేషన్ ఉమ్మడి వైఎస్సార్‌జిల్లా కార్యదర్శి ఎస్.షామీర్‌బాషా, కౌన్సిలర్లు న్యామతుల్లా, సనిశెట్టి నవీన్‌కుమార్, వైఎస్సార్ సీపీ వివిధ విభాగాల కన్వీనర్లు రెడ్డిమాసి రమేష్‌నాయుడు, అబ్దుల్ మునాఫ్, పాపినేని విశ్వనాథరెడ్డి, పోలి మురళీరెడ్డి, దాసరి పెంచలయ్య, కోనిశెట్టి రెడ్డయ్యలు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

సిద్దవటం : ఈనెల 15వ తేదీ నుంచి మండలంలో జరుగనున్న ఆడుందాం ఆంధ్రా క్రీడా పోటీలను విజయవంతం చేయాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ బి.పులిరామ్‌సింగ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న పోటీలను మండల విద్యార్థులు విజయవంతం చేసేందుకు తగిన జాగ్రతలు తీసుకోవాలన్నారు. ఇప్పటికే మండలంలోని ఆయా గ్రామ సచివాలయాల్లో క్రీడాకారులు పేర్లను నమోదు చేసుకున్నారని చెప్పారు. అయితే గ్రామ కార్యదర్శులు క్రీడాకారుల టీమ్‌లను బుధవారం నుంచి ఆన్‌లైన్‌లో ఎంపిక చేయాలన్నారు. క్రికెట్ మహిళలకు, పురుషులకు, కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్, ఖోఖో, టెన్నికాయిట్ వంటి క్రీడా పోటీలను నిర్వహిస్తారని, ఈ పోటీలను ఆయా గ్రామ సచివాలయాల పరిధిలో నిర్దేశించిన ఆట స్థలాల్లో జరుగుతాయని తెలియజేశారు. ఇప్పటికే క్రీడా సామగ్రిని గ్రామ సచివాలయాలకు అందజేశామని ఆయన అన్నారు.



రైల్వేకోడూరు: క్రీడలకు స్థల పరిశీలన చేస్తున్న వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి

మైదానం పరిశీలన

రైల్వేకోడూరు : మండల పరిధిలో డిసెంబర్ 15న నిర్వహించనున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలకు సంబంధించి పట్టణంలోని మండల పరిషత్ ప్రాంగణంలోని మైదానాన్ని బుధవారం వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు ఆదేశాల మేరకు మండల ప్రాంగణంలో వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహించేందుకు స్థలం పరిశీలించామన్నారు. క్రికెట్, ఖోఖో, కబడ్డీ పోటీలను వేరొక చోట నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను ఆటల ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నానన్నారు. కార్యక్రమంలో సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు శివశంకర్‌రాజు, సుదర్శన్, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

ఓబులవారిపల్లె : మండలంలోని స్థానిక పోస్టాఫీసులో తమను కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని తపాలా సిబ్బంది బుధవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తపాలా శాఖలో పని చేస్తున్న ఉద్యోగులను కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించేంత వరకు నిరసనలు ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఉద్యోగులు ఉమాశంకర్, ఇమామ్ సాహెబ్, నారాయణ రెడ్డి, తిరుమలరాజు, శ్రీను, కత్తి ఎర్రిస్వామి, వసంత, సరస్వతి, విజయమ్మ పాల్గొన్నారు.

రాయచోటి టౌన్ : తమ న్యాయపరమైన సమస్యలను పరిష్కరించాలంటూ తపాలా శాఖ ఉద్యోగులు సమ్మె బాట పట్టారు. ఈ క్రమంలో బుధవారం రాయచోటి తపాలా శాఖ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీపీఎం సద్దాం మాట్లాడుతూ జీడీఎస్, పీజెసీఏ కేంద్ర సంఘాల నేత ఇచ్చిన పిలుపు మేరకు ఈ సమ్మెను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏడవ వేతన కమిటీలో అమలు కాని అంశాలపై తపాలా శాఖ ఉన్నతాధికారులు అమలు పేరుతో కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. ఈ సమ్మెలో భాగంగా ప్రధానంగా ఎనిమిది డిమాండ్లను వారి ముందు ఉంచుతున్నామని చెప్పారు. వాటిని పరిష్కరించే వరకు నిరసన కార్యక్రమాలు చేస్తామన్నారు.

నాణ్యమైన విద్యుత్ ఇవ్వడం అభినందనీయం

6వేల వ్యవసాయ విద్యుత్ సర్వీసులు అందించడం ఒక చరిత్ర



ట్రాన్స్‌కో అధికారులతో సమీక్ష చేస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి

రాయచోటి : నాలుగున్నరేళ్ల పాలనా కాలంలో రాయచోటి నియోజకవర్గంలో ఆరు వేల వ్యవసాయ విద్యుత్ సర్వీసులు అందించడం ఒక చరిత్ర అని వైఎస్సార్‌సీపీ రాయచోటి అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి అన్నారు. బుధవారం రాయచోటిలోని ఏపీఎస్పీడీసీఎల్ ఈఈ కార్యాలయంలో ఈఈ చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి ఏడీలు, ఏఈలతో ఆయన విద్యుత్ సమస్యలపై సుదీర్ఘంగా సమీక్షించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో ఆరు వేల వ్యవసాయ విద్యుత్ సర్వీసులు, 24 గంటలపాటు విద్యుత్ సరఫరా తదితర అంశాలలో విజయాలు సాధించామన్నారు. ప్రస్తుతం వ్యవసాయ విద్యుత్ సర్వీసుల కోసం దరఖాస్తులు చేసుకున్న రైతుల వివరాలను ఆయన మండలాల వారీగా అడిగి తెలుసుకున్నారు. మార్చిలోగా వెయ్యి వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లను అందించడమే టార్గెట్‌గా పెట్టుకోవాలని సూచించారు. కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన బిల్లులపై ఆరా తీశారు. లోఓల్టేజీ సమస్యలపై అధికారులను అడిగారు. అలాంటి సమస్య ఎక్కడా లేదని వారు తెలియజేశారు. లైన్ షిఫ్టింగ్ పనులను త్వరితగతిన ప్రారంభించాలన్నారు. గడప గడపకు మన ప్రభుత్వంలో వచ్చిన విద్యుత్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. జగనన్న కాలనీలో విద్యుత్ లైన్లు, లైట్ల ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. నారాయణరెడ్డిపల్లె జగనన్న కాలనీలో రెండువేల విద్యుత్ స్తంభాలు, 70 ట్రాన్స్‌ఫార్మర్లు, వెయ్యి స్ట్రీట్ లైట్లను ఏర్పాటు చేయడం, పట్టణంలో లోఓల్టేజీ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు. ఎంజీ లేఅవుట్, క్రికెట్ స్టేడియంలో విద్యుత్ లైన్ల ఏర్పాట్లను పూర్తి చేయాలని ఎమ్మెల్యే ట్రాన్స్‌కో అధికారులకు సూచించారు.

సంక్షేమ పథకాల ప్రచారానికి బైక్ యాత్ర

రాయచోటి అర్బన్ : సీఎం జగనన్న ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శమని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను 175 నియోజకవర్గాల్లో ప్రచారం చేయాలని పట్టణానికి చెందిన ఫిర్దోస్ ఖాన్ బైక్ యాత్ర చేయాలని సంకల్పించాడు. బుధవారం రాయచోటిలో బైక్ యాత్రను మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషాతో కలిసి శ్రీకాంత్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభిమానంతో, సీఎం జగన్ చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించాలన్న ధ్యేయంతో ఫిర్దోస్‌ఖాన్ రాష్ట్రవ్యాప్తంగా బైక్‌యాత్రను చేపట్టాలనుకోవడం అభినందనీయమన్నారు. అన్ని వర్గాలకు మంచి చేసిన జగన్ ప్రజల హృదయాలలో నిలిచిపోయారన్నారు. బైక్‌యాత్ర విజయవంతం కావాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ఆసిఫ్ అలీఖాన్, జాకీర్, షబ్బీర్, ఫయాజ్ అహ్మద్, జానం రవీంద్రయాదవ్, రియాజ్, నాసిర్, వసంత శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫారెస్టు అధికారులపై చర్యలు తీసుకోవాలి

రాయచోటి అర్బన్ : దళితుడైన పెద్దగంగయ్యను అక్రమంగా అదుపులోకి తీసుకుని బలవంతంగా తెల్లకాగితాలపై వేలిముద్రలు వేయించుకుని, అతని పొలంలోని ఉలవ పంటను దౌర్జన్యంగా దున్నేసిన ఫారెస్టు అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని డీహెచ్‌పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మండెం సుధీర్‌కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం ఫారెస్టు అధికారుల దౌర్జన్యాన్ని నిరసిస్తూ దళితుడైన పెద్దగంగయ్య కుటుంబ సభ్యులతో కలసి సుధీర్ జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఆయన మాట్లాడుతూ కేశావపురం మాదిగపల్లెకు చెందిన దర్మవరం పెద్ద గంగులయ్య గ్రామ పరిధిలోని 1281, 1839 సర్వే నంబర్ల సరిహద్దులుగా ఉన్న 2.50 ఎకరాల ప్రభుత్వ భూమిని వ్యవసాయానికి అనుకూలంగా చేసుకుని వర్షాధారంపై గత 30 ఏళ్లుగా పంటలు సాగు చేసుకుంటున్నారన్నారు. గతంలో ఇదే భూ విషయమై కేశాపురం ఫారెస్టు చెక్ పోస్ట్‌లో గార్డుగా ఉన్న రత్నమ్మ ఇబ్బందులకు గురి చేసిందని ఆరోపించారు. సదరు భూమి ఎవరిదనేది తేలనప్పటికి ఫారెస్టు అధికారులు ఈనెల 11న పెద్ద గంగులయ్యను బెదిరించి తెల్లకాగితంపై వేలి ముద్రలు వేయించుకొని, బాధితుడు సాగు చేస్తున్న ఉలవ పంటను దున్నేశారని చెప్పారు. దళితుడిపై దాడి చేసిన ఫారెస్టు అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ ఆయన డిమాండ్ చేశారు. అనంతరం చిన్నమండెం డిహెచ్‌పియస్ నేతలు పండరయ్య,రెడ్డి సుధాకర్, బాధిత కుటుంబీలతో కలసి జేసీ ఫర్మాన్ అహ్మద్‌కు వినతిపత్రం సమర్పించారు.

‘దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలి’

మున్సిపల్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన



నిరసన తెలుపుతున్న మున్సిపల్ ఉద్యోగులు

రాయచోటి అర్బన్ : ప్రభుత్వ ఉద్యోగులపై దాడులు చేసేవారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మున్సిపల్ ఉద్యోగుల సంఘం అసోసియేట్ ప్రెసిడెంట్ ఎం.మల్లికార్జున డిమాండ్ చేశారు. పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మున్సిపాలిటీ పరిధిలోని 29వ వార్డు సచివాలయం కార్యదర్శి ఆకుల అశోక్‌పై దాడిని నిరసిస్తూ బుధవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ ఉద్యోగులు మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ప్రదర్శన చేశారు.

ఈ సందర్భంగా మల్లికార్జున మాట్లాడుతూ పిడుగురాళ్ల ఘటన బాధాకరమన్నారు. ప్రభుత్వ ఉద్యోగులపై దాడులకు పాల్పడేవారిని కఠినంగా శిక్షించేలా చట్టాలు తీసుకురావాలన్నారు. నిత్యం ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించేందుకు తమవంతు కృషి చేస్తున్న సచివాలయం ఉద్యోగులపై దాడులకు దిగడం క్షమించరాని నేరమన్నారు. దాడి కారకులను శిక్షించాలన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలంటూ కోరారు. గురువారం వెలగపూడి సెక్రటేరియేట్‌లో మున్సిపల్ ఉద్యోగుల సమస్యలపై మున్సిపల్ శాఖ చీఫ్ సెక్రటరీతో జరిగే సమావేశంలో సచివాలయం ఉద్యోగిపై దాడి విషయాన్ని తీసుకెళ్లనున్నట్లు తెలిపారు.

కార్మికులను పర్మినెంట్ చేయాలి



సభలో మాట్లాడుతున్న ఓబులు మురళీ

ఓబులవారిపల్లె : ఏపీఎండీసీలో పనిచేస్తున్న ట్రైనింగ్ అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు మురళీ పేర్కొన్నారు. బుధవారం మంగంపేట ఏపీఎండీసీ కార్యాలయ ప్రాంగణంలో పోరాట కమిటీ జేఏసీ ఆధ్వర్యంలో బహిరంగ సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఏపీఎండీసీ గనుల విస్తరణలో ఇల్లు, భూములు కోల్పోయిన నిర్వాసితుల కుటుంబాలు దాదాపు 15 సంవత్సరాలుగా అవుట్ సోర్సింగ్, ట్రైనీ కార్మికులుగా పనిచేస్తున్నారని, వారిని వెంటనే పర్మినెంట్ చేయాలన్నారు. ఉద్యోగులకు ఇంక్రిమెంట్లను వెంటనే ఇవ్వాలని, అర్హులైన వారికి ప్రమోషన్లు కల్పించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న మెడికల్ బిల్లులను విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సిహెచ్ చంద్రశేఖర్, రామాంజనేయులు, జిల్లా ఉపాధ్యక్షులు పి.శ్రీనివాసులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

కరువు రైతులను మానవత్వంతో ఆదుకోండి



గోపగుడిపల్లెలో పర్యటించిన కరువు బృందం, అధికారులు

రామాపురం : రాయచోటి నియోజకవర్గ కరువు రైతులను మానవత్వంతో ఆదుకోవాలని కరువు బృందానికి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. బుధవారం సాయంత్రం మండలంలోని గోపగుడిపల్లె గ్రామంలో పర్యటించిన కేంద్ర కరువు బృందానికి రైతులు, స్థానిక నాయకులతో కలిసి ఈ ప్రాంతంలోని కరువు పరిస్థితులను, రైతుల కష్టాలు, నష్టాలను శ్రీకాంత్‌రెడ్డి వివరించారు. కరువు బృందం సభ్యులు డా కె.పొన్ను స్వామి, మహేష్‌కుమార్, కైలాష్‌లు తొలుత చిత్ర ప్రదర్శనలో పాల్గొన్నారు. అనంతరం రైతులతో ముఖాముఖి నిర్వహించారు. వ్యవసాయ శాఖ ఏఓ నాగమణి మాట్లాడుతూ మండలంలో 2,440 హెక్టార్లో సాధారణంగా పంట సాగయ్యేదని, వర్షాభావంతో 785 హెక్టార్లు మాత్రమే పంట సాగు చేశారన్నారు. మామిడి తోటలు దిగుబడి చాలా తగ్గే అవకాశం ఉందని వివరించారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల వల్ల గ్రామాలలో తీవ్ర తాగు నీటి ఎద్దడి నెలకొందని, ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసే పరిస్థితులు ఏర్పడ్డాయని వివరించారు. ఉపాధి ఏపీఓ సురేంద్రారెడ్డి మాట్లాడుతూ మండలంలో 9,729 మందికి ఉపాధి పథకం కార్డులు ఉండగా 8,936 కార్డులు యాక్టివేషన్‌లో ఉన్నాయన్నారు. ఇందులో 428 కుటుంబాలు వంద పని దినాలు పూర్తి కావడం జరిగిందని, 1846 కుటుంబాలు 80 రోజుల పనిదినాలు పూర్తి చేశారన్నారు. గోపగుడిపల్లె గ్రామానికి చెందిన రైతులు అచ్చిరాజు, లక్ష్మీనారాయణ, నరసింహరాజు, చిన్న రెడ్డెయ్యలు కరువు బృందం ఎదుట తమ కన్నీటి గాథలను వివరించారు. పశువులకు తాగడానికి సైతం నీరు దొరకని పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాభావంగా కారణంగా 700 అడుగుల లోతు వరకు బోరు వేసిన నీరు పడటంలేదన్నారు. పొలాలు, తోటలు ఎండిపోతున్నాయని రైతులకు బాసటగా నిలవాలని బృందం సభ్యులను కోరారు. ఆంధ్రప్రదేశ్‌లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయ వ్యవస్థ ఎంతో భేష్షుగా ఉందని ప్రశంసించారు. కార్యక్రమంలో ఆర్‌డీఓ రంగస్వామి, జెడ్పీటీసీ వెంకటరమణ, సింగల్ విండో అధ్యక్షుడు పెద్దిరెడ్డి, సర్పంచ్ ముంగర సుబ్బయ్య, ఎంపీటీసీ మౌలా, నాగబసయ్య, బలారం, ఉప సర్పంచ్ శివ తదితరులు పాల్గొన్నారు.

పరుగులు పెడుతున్న వెలిగల్లు నీరు

రామాపురం : మండల రైతాంగానికి ఇచ్చిన మాట నిలబెట్టుకొని రామాపురం మండలానికి వెలిగల్లు నీరును ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి విడుదల చేయించారు. దీంతో వెలిగల్లు నుంచి 60 కి.మీ.ల దూరంలో ఉన్న మండలానికి వెలిగల్లు నీరు చేరింది. మండలంలోని బయారెడ్డిగారిపల్లె, తూపల్లె, ఓబుల్‌రెడ్డిగారిపల్లెలకు నీళ్లు వదిలారు. ప్రతి ఒక్క చెరువులు, వంకలు, చెక్‌డ్యాంలలో నీటిని నింపారు. దీంతో మండలంలోని కాలువలు జలకళను సంతరించుకోవడంతో ప్రజలు, రైతులు ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డికి కృతజ్ఞతలను తెలియజేశారు.

పీడీఎస్‌యూ సభలను జయప్రదం చేయండి

రాయచోటి అర్బన్ : నెల్లూరు నగరంలో డిసెంబరు 15,16,17 తేదీలలో జరిగే పీడీఎస్‌యూ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి అంకన్న కోరారు. బుధవారం పట్టణంలోని శ్రీనివాస ఐటీఐ కళాశాల విద్యార్థులతో కలసి ఆయన రాష్ట్ర మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ పీడీఎస్‌యూ గత 51 సంవత్సరాలుగా విద్యార్థుల, మహిళల, యువజనుల, ప్రజా సమస్యలపై పోరాటం చేసి పరిష్కరించిందన్నారు. మహాసభలకు ఉపాధ్యాయులు, మేధావులు, న్యాయవాదులు, వైద్యులు, విద్యార్థులు హాజరై విజయవంతం చేయాలంటూ కోరారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నేతలు వాసుదేవనాయక్, ప్రసాద్, చిన్న రెడ్డెయ్య, బాలచంద్ర, గణేష్, కార్తీక్, మహేష్, యశ్వంత్, భాస్కర్, రాజగోపాల్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

పది మోడల్ పేపర్ల ఆవిష్కరణ

పెనగలూరు (ఓబులవారిపల్లె) : యూటీఎఫ్ ఆధ్వర్యంలో చక్రంపేట జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పదో తరగతి మోడల్ పేపర్స్ పుస్తకాలను బుధవారం ప్రధానోపాధ్యాయుడు గోపాలకృష్ణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూటీఎఫ్ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడమే కాకుండా విద్యార్థుల శ్రేయస్సును గురించి కూడా ఆలోచిస్తుందని వారన్నారు. ప్రతి ఏడాది విద్యార్థులకు అనుభవం ఉన్న ఉపాధ్యాయులచే పదోతరగతి మోడల్ పేపర్స్ తయారు చేసి పంపిణీ చేయడం జరుగుతోందన్నారు. అనంతరం విద్యార్థులకు మోడల్ పేపర్లను అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాముడు, హరిప్రసాద్, అన్వర్ బాషా, మహేంద్ర, సుదర్శన్, ప్రమీల, శ్రీవాణి, పరిమళ, పద్మజ, జయలక్ష్మి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై విద్యార్థులకు అవగాహన

రాజంపేట టౌన్ : స్థానిక మన్నూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం ఫైర్ ఆఫీసర్ మాబు సుబహాన్ అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్ని ప్రమాదం జరిగిన వెంటనే ఎలా స్పందించాలి, మంటలు ఎగిసి పడకుండా ఎలా అదుపులోకి తీసుకురావాలి అన్న విషయాలను ఆయన విద్యార్థులకు తెలియజేశారు. అగ్ని ప్రమాదం జరిగిన వెంటనే ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఈ సందర్భంగా మంటలు వ్యాపించినప్పుడు ఆర్పే విధానాన్ని ఫైర్ ఆఫీసర్ విద్యార్థులకు డెమో ద్వారా వివరించారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ



రైల్వేకోడూరు: రామాలయం నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న దృశ్యం

రైల్వేకోడూరు : మండలంలోని ఉర్లగట్టుపోడు పంచాయతీలోని వైఎస్సార్ ఎస్టీ కాలనీలో బుధవారం రామాలయం నిర్మాణానికి వేదపండితుల మంత్రోచ్చారణాల మధ్య ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు నా వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు. అలాగే దేవుడి ఆశీస్సులు ఎల్లప్పుడూ ప్రజలకు ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ధ్వజారెడ్డి, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్‌రాజు, సర్పంచ్ గోపి, బాబు, ఎంపీటీసీ బండారు మల్లిఖార్జున, మల్లు క్రిష్టారెడ్డి, దామర్ల సిద్దయ్య, సుబ్రమణ్యం, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఓబులవారిపల్లె: మృతుడి కుటుంబాన్ని పరామర్శిస్తున్న ప్రభుత్వవిప్ కొరముట్ల

పరామర్శ

ఓబులవారిపల్లె : మండలంలోని ముక్కావారిపల్లి జాతీయ రహదారిపై ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ జి.చంద్రచారి (40) బుధవారం తెల్లవారుజామున మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. భరోసా కల్పించి అండగా ఉంటామని తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మంగంపేట అగ్రహారం గ్రామానికి చెందిన చంద్రచారి లారీ డ్రైవర్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆయనకు భార్య వాణి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పరామర్శించిన వారిలో వైఎస్సార్‌సీపీ నాయకులు తల్లెం రమణారెడ్డి తదితరులు ఉన్నారు.


స్వదేశీ మ్యాప్‌లతోనే దేశ రక్షణ



జీఐఎస్ మ్యాప్‌ల తయారీ విధానాన్ని తెలియజేస్తున్న ఆనంద్‌కిషోర్

రాజంపేట టౌన్ : దేశ రక్షణకు స్వదేశీ మ్యాప్‌లనే వినియోగించాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.పురుషోత్తం తెలిపారు. డిగ్రీ కళాశాలలో బుధవారం జియోగ్రాఫికల్ ఇన్ఫర్మేషన్ సిస్టం అనే అంశంపై ఐఐటీ తిరుపతి నవ ఆవిష్కార్ ఐ హబ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సైన్స్ విద్యార్థులకు వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ దేశీయంగా మ్యాప్‌లు తయారీ వల్ల యువతకు అనేక అవకాశాలు అందుబాటులోకి వస్తాయన్నారు. గూగుల్ వంటి విదేశీ సంస్థలపై ఆధారపడాల్సిన అవసరం ఉండదని తెలిపారు. విదేశీ సంస్థలు రూపొందించే మ్యాప్‌లను ఉపయోగించడం వల్ల మన డేటాకు రక్షణ ఉండదన్నారు. యువత సాంకేతికతను సద్వినియోగం చేసుకొని తద్వారా ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా పై సంస్థ ప్రతినిధి ఆనంద్‌కిషోర్ విద్యార్థులకు జియోగ్రాఫికల్ ఇన్ఫర్మేషన్ ఉపయోగాలను తెలియజేశారు. అలాగే జియోగ్రాఫికల్ మ్యాప్‌లను తయారు చేసే విధానాన్ని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించి, విద్యార్థులతో జీఐఎస్ మ్యాప్‌లను తయారు చేయించారు. జీఐఎస్ మ్యాప్‌లను తయారు చేయడంలో ప్రతిభ కనబరచిన విద్యార్థులను రాష్ట్రస్థాయి పోటీలకు పంపనున్నట్లు ఆనంద్‌కిషోర్ తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రాజమోహన్‌రెడ్డి, కంప్యూటర్ ఫ్యాకల్టీ నరేష్‌బెహరా పాల్గొన్నారు.

విజయవంతం చేయండి



మహాసభల కరపత్రాన్ని ఆవిష్కరించిన దృశ్యం

సిద్దవటం : కడప నగరంలో జనవరి 7,8 తేదీలలో జరిగే రెవల్యూషనరీ స్టూడెంట్ యూనియన్(ఆర్ఎస్‌యూ) రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆర్ఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్ తెలిపారు. మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో బుధవారం రాష్ట్ర మహాసభల కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఈ మహాసభలను రాష్ట్రవ్యాప్తంగా ఉన్న విద్యార్థులు, నిరుద్యోగులు, మేధావులు విచ్చేసి జయప్రదం చేయాలన్నారు. రాష్ట్రంలోని సంక్షేమ హాస్టల్‌లలో చదువుతున్న విద్యార్థులు నిత్యం అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారన్నారు. హాస్టల్‌లలో రెగ్యులర్ వార్డెన్‌లు లేక ఇన్‌చార్జిలతో ప్రభుత్వం నెట్టుకొస్తుందన్నారు. దీంతో విద్యార్థులపై పర్యవేక్షణ కరువై నిత్యం విద్యార్థులు ప్రమాదాల బారీన పడుతున్నారని ఆయన చెప్పారు. కార్యక్రమంలో ఆర్ఎస్‌యూ నాయకులు హరి, కళ్యాణ్, సుకుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.